
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025





సీఎం చంద్రబాబు నాయుడుకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే గణబాబు ఉన్నారు.



సీఐఐ సదస్సు ముగింపు సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. చిత్రంలో మంత్రులు నారా లోకేశ్, నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్, కార్యదర్శి యువరాజ్ ఉన్నారు.



రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్న రేమండ్ ప్రతినిధులను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు. చిత్రంలో మంత్రి టీజీ భరత్ ఉన్నారు.

అధికారులకు సీఎం అభినందనలు

- చక్కగా పనిచేశారని కితాబు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులను సీఎం నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. శనివారం సదస్సు ముగింపు కార్యక్రమంలో భాగంగా అధికారులను ప్రధాన వేదికపై సత్కరించారు. ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, సమాచార పౌరసంబంధాల శాఖ డీడీ సదారావు, పర్యాటకశాఖ అధికారి మాధవి తదితరులు సీఎం నుంచి జ్ఞాపికలు అందుకున్నారు. ఇంకా సీఐఐ లోకల్ చాప్టర్ ఛైర్మన్ గన్నమని శ్రీనివాస్, ఆయన బృందాన్ని సీఎం అభినందించారు. అనంతరం అందరితో సీఎం ఫొటోలు దిగారు.

పోలీసు సేవలు ప్రశంసనీయం

సీఐఐ సదస్సు సందర్భంగా సమర్థంగా బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ చేపట్టారని సీపీ శంఖబ్రతబాగ్చి, పోలీసులను సీఎం చంద్రబాబునాయుడు అభినందించారు. సీఐఐ సదస్సుకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడుతో పాటు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, 40దేశాల ప్రతినిధులు హాజరవడంతో సీపీ శంఖబ్రతబాగ్చి పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్లు, సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు. వీఐపీలు

... మిగతా 6వ పేజీలో

సదస్సు సూపర్ సక్సెస్

అందరిలోను ఆనందోత్సాహాలు

అంచనాలకు మించి పెట్టుబడులు రాక



సీఎం చంద్రబాబు నాయుడు అభివాదం



సదస్సులో సీఐఐ అధ్యక్షుడు రాజేంద్ర మోమానీని సత్కరిస్తున్న మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన రెండు రోజుల సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు సూపర్ సక్సెస్ అయింది. సీఐఐ చరిత్రలో ఇంతవరకు ఏ సదస్సు ఈ స్థాయిలో విజయవంతం కాలేదని స్వయంగా ముఖ్యమంత్రే వెల్లడించారు. ఊహించిన దానికంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు రావడం, ఆహ్వానించిన వారంతా తరలిరావడం, అందరికీ అతిథి మర్యాదలు బాగా జరగడంతో అందరిలోను సంతృప్తి కనిపించింది. ప్రతి ఒక్కరూ నిర్వహణ, ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసలు కురిపించారు.

ఈ సదస్సు కోసం జిల్లా అధికారులు నెల రోజుల ముందునుంచి కసరత్తు ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పొరుగు జిల్లా మంత్రులు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు

... మిగతా 6వ పేజీలో

ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు ప్రాధాన్యం

- ఈ విషయంలో అపోహలు పెట్టుకోవద్దు
- లూలూ షాపింగ్ మాల్ కాదు.. ఎక్స్‌పీరియెన్స్ సెంటర్
- ఉమ్మడి విశాఖలోనే అధిక స్టీల్ ఉత్పత్తి
- తూర్పు తీరం నుంచి పశ్చిమ తీరానికి పోర్టు కనెక్టవిటీ
- స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆగిందని ఇంటింటికీ వెళ్లి చెప్పాలా?
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చే ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు అధికంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని, ఈ విషయంలో అపోహలు పెట్టుకోవద్దని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

సీఐఐ పెట్టుబడిదారుల సదస్సు ముగిసిన తరువాత శనివారం సాయంత్రం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ విలేకరి ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇస్తున్నారని సీఎం దృష్టికి తీసుకురాగా అందులో వాస్తవం లేదన్నారు. కొత్తగా వచ్చిన టీసీఎస్, కాండ్యుయెంట్ కంపెనీలన్నీ ఏపీ యువతనే తీసుకుంటున్నాయని ఐటీ శాఖ మంత్రి లోకేశ్ సమాధానమిచ్చారు. సీఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ గూగుల్‌కు కూడా ఇదే సదస్సులో శంకుస్థాపన చేయాల్సి ఉందని, కొన్ని సాంకేతిక అంశాల కారణంగా వాయిదా పడిందన్నారు. గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడం వల్లనే గూగుల్ విశాఖకు వచ్చిందని, దాంతో మరో ఐదారు డేటా సెంటర్లు రానున్నాయన్నారు. రిలయన్స్ సంస్థ ఒక గిగావాట్ సెంటర్‌కు

... మిగతా 6వ పేజీలో

కిక్కిరిసిన సింహగిరి



దర్శనానికి నీలాద్రిగుమ్మం వద్ద బారులు తీరిన భక్తులు

- అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఆలయానికి రూ.36.5 లక్షల ఆదాయం

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస బహుళపక్ష ఏకాదశి, శనివారం కావడంతో వరాహలక్ష్మీనృసింహ స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో సింహగిరి భక్తజనసంద్రమైంది. శుక్రవారం రాత్రికే ఒడిశా సరిహద్దు గ్రామాలు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, వరాహ పుష్కరిణిలో పవిత్ర సాన్నాలు ఆచరించారు. తొలిమెట్టు అప్పన్నస్వామి విగ్రహం వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. సింహగిరికి చేరుకున్న భక్తులు గంగధారలో పవిత్ర స్నానాలు ఆచరించి సింహాద్రినాథుని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా అప్పన్న ఖజానాకు శనివారం ఒక్కరోజే సుమారు రూ.36.5 లక్షల ఆదాయం సమకూరింది. అత్యధికంగా శీఘ్ర, అతి శీఘ్ర దర్శనం టికెట్ల ద్వారా సుమారు రూ.19.8లక్షలు లభించింది. ఈఓ సుజాత ఆధ్వర్యంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు.

లోకేశ్ ప్రజాదర్బార్




మహిళ అందజేసిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారా లోకేశ్

- టీడీపీ కార్యాలయంలో నిర్వహణ
- సమస్యలు వివరించి, వినతులిచ్చిన బాధితులు

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ శనివారం విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 73వ ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించి, వినతిపత్రాలను స్వీకరించారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగకు చెందిన బంగారి శ్రీనివాస రావు తన 5.64 ఎకరాల భూమిని కొందరు నకిలీ పత్రాలతో కాజేశారని మంత్రికి ఫిర్యాదు చేశారు. జీవీఎంసీలో ఉద్యోగావకాశాలు కల్పించాలని 'నీతోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్' ప్రతినిధులు మంత్రికి విన్నవించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమార్తె చికిత్సకు సహాయం చేయాలని నెల్లూరుకు చెందిన కొప్పూరు సుధాకర్ వినతి పత్రం ఇచ్చారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో తనకున్న మూడు ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించారని, న్యాయం చేయాలని విశాఖ నగరానికి చెందిన ఎన్.నరసింహస్వామి మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. వినతిపత్రాలన్నింటినీ పరిశీలించి, విచారణ అనంతరం పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి ఈ సందర్భంగా బాధితులకు హామీ ఇచ్చారు.

ఉక్కు ఉద్యోగులకు యాజమాన్యం షాక్



- ఈ నెల నుంచి ఉత్పత్తికి తగినట్టుగా జీతాలు ఇస్తామని ఉత్తర్వులు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికులకు శనివారం మరో ఝలక్ ఇచ్చింది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో అందరికీ పూర్తి జీతాలు ఇచ్చామని, నవంబరు నెల నుంచి ఉత్పత్తితో ముడిపడిన జీతాలు ఇస్తామని ఉత్తర్వులు జారీచేసింది. అంటే లక్ష్యం మేరకు ఉత్పత్తి చేస్తేనే పూర్తి జీతం (100 శాతం) వస్తుందని, ఉత్పత్తి తగ్గితే ఆ మేరకు జీతాలు కూడా తగ్గుతాయని ప్రకటించింది. ఇటీవల స్టీల్ యాజమాన్యం రోజుకు 19 వేల టన్నులు ఉత్పత్తి తీస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హామీ ఇచ్చింది. ముడి పదార్థాలు అందుబాటులో లేక, విభాగాల్లో తలెత్తే సాంకేతిక సమస్యల వల్ల ఒక్క రోజు కూడా ఆ లక్ష్యం సాధించలేకపోయారు. దాంతో ఉద్యోగులు, కార్మికులు ఆ లక్ష్యం సాధిస్తేనే 100 శాతం జీతాలు ఇస్తామని, లేదంటే కోత తప్పదని ఇప్పుడు ఒత్తిడి పెడుతోంది. దీనికి లక్ష్యాలు నిర్దేశించింది. సింటర్ ప్లాంటులో రోజుకు సగటున 24 వేల టన్నులు, బ్లాస్ట్ ఫర్నేసుల ద్వారా రోజుకు 19 వేల టన్నుల హాట్ మెటల్, ఎస్ఎంఎస్ విభాగంలో 125 హీట్లు, కోక్ ఓవెన్ ప్లాంటులో 370 పుషింగ్‌లు, రోలింగ్ మిల్స్‌లో 13,500 టన్నులు, మార్కెటింగ్‌లో 15 వేల టన్నులు తీయాలని స్పష్టంచేసింది. యాజమాన్యం నిర్ణయంపై ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు, విభాగాలు సవ్యంగా నడవడానికి విడి భాగాలు ఇవ్వాల్సి ఉందని, వాటిని ఇవ్వకుండా పూర్తి ఉత్పత్తి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నిస్తున్నారు.



స్వామివారి సేవల్లో పాల్గొన్న భక్తులు

సంప్రదాయబద్ధంగా ఆర్జిత సేవలు



సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ధూప సేవ, సేవా కాలం యథావిధిగా పూర్తి చేశారు. అనంతరం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళార్చన జరిపారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

59 మందికి నేత్ర వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడివాడ ప్రాథమిక పాఠశాలలో దివీస్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ, ఎరుసుపేట, చెరుకుపల్లి, శ్రీరాంనగర్ పాఠశాలలకు చెందిన 59 మంది విద్యార్థులకు పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మనస్వి, ఆప్తమాలజిస్టు గణపతి వైద్య పరీక్షలు చేశారు.సమస్యలున్న 11 మందికి చుక్కల మందు, మల్టీ విటమిన్స్ అందజేశారు. ఒక విద్యార్థికి కంటి అద్దాలు అవసరం కాగా 15 రోజుల్లో ఏర్పాటు చేస్తామని దివీస్ సీఎస్‌ఆర్ మేనేజరు సురేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున, దివీస్ కంపెనీ ప్రతినిధులు నరసింహ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణంలో అక్రమాలు జరగలేదు'

భీమునిపట్నం (రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద చేపట్టిన భవన నిర్మాణంలో ఎటువంటి అక్రమాలు జరగలేదని పాఠశాల పూర్వ హెచ్‌ఎం కె. ప్రభాకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్మాణానికి సంబంధించిన బిల్లులన్నీ ప్రభుత్వానికి అప్‌లోడ్ చేశానని, కొంతమంది తన మీద తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నిధులు పూర్తిగా విడుదల కాకపోవడంతో కొన్ని పనులు అంపూర్తిగా ఉన్నాయని చెప్పారు.

ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు జరగక ఇబ్బందులు

ఎండాడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని బీసీ, ఎస్సీ కాలనీలో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న వారు తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై గతంలో వారు జిల్లా కలెక్టర్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు విన్నవిం చారు. 1988లో ఎండాడలో బీసీ, ఎస్సీ కాలనీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి కొంత సొమ్ము ధరావత్తు చెల్లించి 2018లో పట్టాలు పొందారు. కాలనీల్లో 2019కి ముందు నివాసం ఉంటున్న వారంతా జీవో 30 ప్రకారం క్రమబద్ధీకరణకు అర్హులని ప్రభుత్వం చెబుతున్నా.. కాలనీల్లో ఉంటున్న 500 మంది నివాసితులకు రిజిస్ట్రేషన్లు కావడం లేదు. దీనికి గల కారణాలు తెలియడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో అనిట్స్ విద్యార్థినికి పతకం

తగరపువలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంగివలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న బి. షర్మిల ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ సాధించారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, అధ్యాపకులు ఆమెను అభినందించారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు పంజాబ్‌లోని అమృతసర్ గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఆమె ఈ ఘనత సాధించారు. కార్యక్రమంలో మెకానిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డా. బి.నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ డా. వేణుగోపాల్, సహాయ డైరెక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో అన్న సమారాధన

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాత్యాయిని సహిత భీమేశ్వరాలయంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు ఏడిద శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు వేల మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఫుట్‌బాల్ కప్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహించనున్న డీఆర్‌ఎం కప్ ఆలిండియా ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రచార పోస్టర్‌ను డీఆర్‌ఎం లలిత్ బొహ్రా శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వాల్తేరు రైల్వే స్టేడియం వేదికగా డిసెంబరు 14 నుంచి 21 వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ టోర్నీలో వివిధ ప్రాంతాలకు చెందిన 12 జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ విశాఖలో ఫుట్‌బాల్ క్రీడకు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలు తలెత్తకుండా టోర్నీని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

సదస్సు సూపర్ సక్సెస్

... 5వ పేజీ తరువాయి

అంతా దగ్గరుండి ఏర్పాట్లు చూసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించుకుంటూ లోపాలను సరిదిద్దుకున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పోలీసులు ఎక్కడా అతిగా ప్రవర్తించకుండా ముందుగానే హెచ్చరికలు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. రెండు రోజుల సదస్సు పూర్తిగా విజయవంతం కావడంతో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అధికారులను, స్థానిక నాయకులను శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఆ ఉత్సాహంతోనే వచ్చే సదస్సు కూడా నవంబరు 2026లో ఇక్కడే నిర్వహిస్తామని చంద్రబాబు ప్రకటించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



థింసా నృత్యం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి సంధ్యారాణి, నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి, తదితరులు

గిరిజన అభ్యున్నతికి నిరంతరం కృషి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- టీసీఆర్ టీఎంలో ముగిసిన జన జాతీయ గౌరవ్ దివస్

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు అన్నారు. సాగర్‌నగర్‌లోని ట్రైబుల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ (టీసీఆర్,టీఎం) కార్యాలయంలో పదిహేను రోజులుగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ దివస్ (జేజేజీడీ), భగవాన్ బిర్సాముండా 150వ జయంత్యుత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో కనుమరుగైన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి, గౌరవం ఇవ్వడానికి ప్రధాన మంత్రి మోదీ చేపట్టిన జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమం ఒక చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.గిరిజన విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం మనకు ఎంతో గర్వకారణం అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ఐటీడీఏల్లో ఐఏఎస్ అధికారులను నియమించడం వల్ల పరిపాలనను మరింత పారదర్శకంగా గిరిజనులకు దగ్గరగా మార్చిన విషయాన్ని ప్రస్తావించారు. జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన టీసీఆర్ టిఎం బృందాన్ని అభినందించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సమిధాసింగ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రూ.600 కోట్లతో గిరిజన ప్రాంత రహదారులు, గృహ నిర్మాణాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించినట్టు వెల్లడించారు. తొలుత సంప్రదాయ నృత్యాలతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఆహ్వానం పలికారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తులు, సంప్రదాయ పనిముట్లు, తదితర వస్తువులను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సదాభార్గవి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి, టీసీఆర్‌టీఎం అధికారులు, కేంద్ర రాష్ట్ర ఉద్యోగులు, ఐటీడీఏల పీఓలు పాల్గొన్నారు.



పద్మనాభంలోని అనంతుని ఆలయంలో భక్తులు



సౌమ్యగిరి మెట్ల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మార్మోగిన హరిహర నామ స్మరణ

కార్తీక బహుళ ఏకాదశి పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పద్మనాభం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతుడి గిరి భక్తులతో కిటకిటలాడింది. శనివారం కార్తీక బహుళ ఏకాదశి కావడంతో స్వామివారి దర్శనానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వాహనాలతో గిరిపై భాగంలోని పార్కింగ్ స్థలం కిక్కిరిసిపోయింది.గిరిపై ఉన్న అనంతుడికి, కొండ దిగువన ఉన్న కుంతీమాధవస్వామికి, నారాయణేశ్వరస్వామికి భక్తులు ఏకాదశి పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కాగా విశాఖపట్నానికి చెందిన మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘట్టమనేని సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్యే గంటా సూచన మేరకు అనంతుని దీపోత్సవానికి అవసరమైన విద్యుద్దీపాలంకరణ చేయడానికి ముందుకు వచ్చారు. పద్మనాభం వచ్చిన ఆయన అనంతుడిని, కుంతీమాధవస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేశ్ కుమార్‌తో కలిసి లైటింగ్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను గుర్తించారు.

భీమునిపట్నం : పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున అయిదున్నర నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. కొండ దిగువన స్వామివారి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి, దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం గిరి మెట్లకు పసుపు,కుంకుమ బొట్లు పెడుతూ ఆలయానికి చేరుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం మెట్ల మార్గంలో దీపాలు వెలిగించారు. కాగా మెట్ల మార్గంలో విద్యుత్ లైట్లు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడం, ఘాట్‌రోడ్‌లో పూర్తిగా లైట్లు లేకపోవడంతో భక్తులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న దేవస్థానం అధికారులు, సిబ్బంది

సింహగిరిపై 'స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎల్లవేళలా పరిశుభ్ర వాతావరణంలో సేవలందిస్తామని దేవస్థానం ఈఓ ఎన్. సుజాత అన్నారు.శనివారం ఈఓ సారథ్యంలో అప్పన్న ఆలయ ప్రధాన రాజగోపురానికి ముందు అధికారులు, సిబ్బంది స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓలు కె. తిరుమలేశ్వరరావు, వీవీ రమణమూర్తి, పంతం శ్రీనివాస్, పర్యవేక్షణాధికారులు మూర్తి, రమణరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 98వ వార్డు సింహాచలనగర్‌లోని ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం గేదెల సన్యాసినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు.



అధికారులకు విరాళం అందజేస్తున్న దాత

చందన సమర్పణకు రూ. 2 లక్ష విరాళం

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిపై ఏడాది పొడవునా ఉండే చందనం సమర్పణకు కోల్‌కత్తాకు చెందిన ప్రవేశ్ దుదాని రూ.2లక్షల విరాళంగా అందజేశారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో ఏఈఓ కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్‌కు శనివారం ఆయన అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

జాతీయ పోటీలకు గురుకుల విద్యార్థి

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అడివివరంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జుత్తు సాగర్ లాంగ్ జంప్ జాతీయ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రమా మోహిని తెలిపారు. శనివారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. ఈమేరకు నిర్వాహకులు విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

పుస్తక పఠనంతో ఎంతో మేలు

గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తలు



అడవివరంలో ఉద్యమ నేతలకు నివాళులు



భీమిలి : మాట్లాడుతున్న తట్టికోట భీమారావు

భీమునిపట్నం,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని భీమిలి తాలూకా ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తట్టికోట భీమారావు సూచించారు. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన, సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు.వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనకల సన్యాసినాయుడు మాట్లాడుతూ మారుతున్న సమాజంలో విద్యార్థులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు అలవాటు పడుతున్నారని, ఈ పరిణామం మంచిది కాదన్నారు.క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల, విజ్ఞానంతో పాటు మంచి ప్రవర్తన అలవడుతుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్స్ పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారి మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, దత్తి ఈశ్వరరావు, రాధాకృష్ణ ప్రసాదు,సరోజ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియరు కళాశాలలో కూడా గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కళాశాల గ్రంథాలయ అధ్యాపకురాలు కె. ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాంప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

సింహాచలంలో...

సింహాచలం : యువత భవితకు గ్రంథాలయాలు పునాదులు అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు, ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. సోమశేఖర్ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి నరసింహం సారథ్యంలో జరుగుతున్న వారోత్సవాల్లో శనివారం ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతకు గ్రంథాలయాల్లో కావాల్సినన్ని పుస్తకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. అంతకముందు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రూ.5 వేల కోట్లతో గోవా షిప్‌యార్డ్స్ ప్రాజెక్టు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గోవా షిప్ యార్డ్ ప్రాజెక్టు హెడ్ ఆదికేష్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. రెండోరోజు సదస్సులో ఆయనతో సమావేశమైన మంత్రి లోకేష్ రూ.5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు గోవా షిప్‌యార్డ్ సంస్థ రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సంస్థ హెడ్ ఆదికేష్‌ను అభినందించారు. 1057 కిలో మీటర్ల సువిశాల తీర ప్రాంతం కలిగిన ఏపీలో పెట్టుబడులు పెట్టడం సరైన నిర్ణయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సంస్థ ప్రాజెక్టు హెడ్ ఆదికేష్ వాసుదేవన్ మాట్లాడుతూ తాము నిర్మించబోయే షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ద్వారా 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ దేశంలోని ప్రముఖమైన, అత్యంత ఆధునిక రక్షణ షిప్‌యార్డ్‌ల్లో ఒకటిగా ఉందన్నారు.

జెలెస్ట్రా పవర్ సీఈవోతో మంత్రి భేటీ

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ విడి భాగాల తయారీ యూనిట్ ఏర్పాటుచేయాలని జెలాస్ట్రా పవర్ సీఈవో పరాగ్ శర్మను మంత్రి నారా లోకేష్ కోరారు. భాగస్వామ్య సదస్సు రెండోరోజైన శనివారం పరాగ్ శర్మతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ ప్యానల్స్, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థల కోసం ఏపీలో రెన్యూబుల్ ఎనర్జీ మానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విడిభాగాల ఎగుమతికి సౌలభ్యంగా ఉండేలా పోర్టు సమీపంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు. అనంతరం జెలెస్ట్రా పవర్ సీఈవో పరాగ్‌శర్మ మాట్లాడుతూ హరియాణాలోని గురుగావ్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ వర్టికల్ ఇంటిగ్రేటెడ్ రెన్యూబుల్ ఎనర్జీ డెవలపర్‌గా, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ఉందన్నారు. యుటిలిటీ స్కేల్ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి, కనస్ట్రక్షన్ రంగాల్లో తాము సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రూ.579 మిలియన్ పౌండ్ల వార్షికాదాయం కలిగిన తమ సంస్థ ఏడు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని వెల్లడించారు.

విశాఖ నుంచి అంతర్జాతీయ కార్గోకు పచ్చజెండా

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో రవాణాకు అనుమతులు మంజూరు చేసినట్టు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు శనివారం ప్రకటించారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం(అపాటా) తెలిపింది. కోవిడ్ సమయంలో ఈ సేవలు నిలిచిపోగా ఆ తరువాత పునరుద్ధరించలేదు. అనేక ప్రయత్నాల మీదట ఇప్పుడు అనుమతి వచ్చింది. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు, అబు దాబీకి అంతర్జాతీయ విమానాలు నడుస్తున్నాయి. వాటిలో ఇకపై సరకు రవాణా చేసుకోవచ్చునని అపాటా ప్రతినిధులు కుమార్ రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు తెలిపారు.



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

ఘనంగా కోటి దీపోత్సవం

సింహాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) :కార్తీక మాసం పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరాహ పుష్కరిణి వద్ద శనివారం సాయంత్రం కోటి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు హరినామ స్మరణలతో పూజలు, భజనలు చేస్తుండగా మహిళలు నక్షత్ర హారతలిచ్చారు. కొందరు పుష్కరిణి ఒడ్డున నిర్వాహకులు ఉచితంగా అందజేసిన ప్రమిదలు, అరటి డొప్పల్లో దీపారాధన చేశారు. దీప కాంతుల్లో పుష్కరిణి దేదీప్యమానంగా వెలిగిపోయింది.

సన్యాసినాయుడుకు గంటా అభినందనలు



సన్యాసినాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ పట్టణ సీనియర్ నాయకుడు గాడు సన్యాసినాయుడు నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆయన ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసారు. సన్యాసినాయుడును ఎమ్మెల్యే శాలువ కప్పి సత్కరించారు. ఎమ్మెల్యేకు సన్యాసినాయుడు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గాడు అప్పలనాయుడు, 3వ వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొలగాని నరేంద్రకుమార్, కనకల అప్పలనాయుడు, కోశాధికారి కంచర్ల కామేశ్వరరావు, మాజీ కౌన్సిలరు ఎ. గురునాథరావు, నక్కిళ్ళ పెద వెంకట్రావు, గాడు ఆనంద్, కాసరపు పెద ఎల్లాజి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

ఎంఓయూ చేసిందన్నారు.

అది ఎక్స్‌పీరియన్స్ సెంటర్

విశాఖలో ఐటీ ఉద్యోగులకు సోషల్ లైఫ్ కావాలని, ఈ నేపథ్యంలోనే లూలూ మాల్‌ను పెడుతున్నామన్నారు. అది షాపింగ్‌కే పరిమితం కాదని, ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ స్టీల్, కొత్తగా అనకాపల్లి జిల్లాలో వచ్చే ఆర్సెలర్ మిట్టల్ ద్వారా దేశంలోనే అత్యధిక స్టీల్ తయారవుతుందన్నారు. మిట్టల్ స్టీల్ కోసం ఎన్‌ఎండీసీ నుంచి ముడిఇనుమును పైపులైన్ ద్వారా తెప్పించడానికి ప్రధాని నరేంద్రమోదీతో ఆ శాఖకు చెప్పించాల్సి వచ్చిందని వివరించారు. వారు దశల వారీగా రూ.1,35,000 కోట్ల పెట్టుబడి పెడతారన్నారు. తూర్పు తీరంలో పోర్టుల ద్వారా పశ్చిమ తీరంలో పోర్టులకు కనెక్టివిటీ పెంచుతున్నామని, దానిద్వారా లాజిస్టిక్స్ వ్యయం తగ్గుతుందన్నారు. దసపల్లా , నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ భూములు చేతులు మారిపోయాయని, వాటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని ఓ విలేకరి ప్రశ్నించగా, చట్టప్రకారం ముందుకు వెళతామన్నారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఎలా జరుగుతుంది?

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆగినట్టా?, లేదా?...అని ఓ విలేకరి ప్రశ్నించగా సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కేంద్రం రూ.12 వేల కోట్లు ఇచ్చింది దేనికని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం ఉంటే ఇస్తారా?...అని నిలదీశారు. ప్రైవేటీకరణ ఆగిందని ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి చెప్పాలా? అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల విద్యుత్ బకాయిలను ఈక్విటీగా మార్చిందని, నీటి పన్ను, ఆస్తి పన్ను వదులుకుందని, సెక్యూరిటీ కూడా ఇచ్చిందని, ఇదంతా దేని కోసమని ప్రశ్నించారు. పనిచేయకుండా పడుకుంటే నష్టాలు రావా? అన్నారు. అందుకే కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.

అధికారులకు సీఎం అభినందనలు

... 5వ పేజీ తరువాయి

ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్‌జామ్‌లకు అవకాశం లేకుండా 'అస్త్రం' యాప్ ద్వారా పర్యవేక్షించారు. సదస్సు ప్రాంగణంలోనే కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించేలా ఐపీఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రజలు, ప్రతినిధులపట్ల గౌరవంగా వ్యవహరించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. డ్యూటీలో ఉన్నచోటకే భోజనం సరఫరా చేస్తామని చెప్పడంతో సిబ్బంది ఉన్న చోటే సమర్థంగా విధులు నిర్వర్తించారు.

ఆకట్టుకున్న అమరావతి నమూనా

- సందర్శకులను ఆలోచింపజేసిన డిజైన్
- తిలకించిన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేల బృందం

సిరిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన దేశ, విదేశీయులను అమరావతి నమూనా విశేషంగా ఆకట్టుకుంది. సమ్మిట్ కాన్ఫరెన్స్ హాల్స్‌కు వెళ్లే దారిలో సీఆర్డీఏ అధికారులు రూపొందించిన అమరావతి డిజైన్ ప్రదర్శనకు ఉంచారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఎలా రూపాంతరం చెందబోతుందో కళ్లకు కట్టినట్లుగా నమూనాలో చూపించారు. అక్కడ ఫొటోలు తీసుకునేందుకు విదేశీయులు సైతం ఎంతో ఆసక్తి కనబరిచారు. అమరావతిలో ఎత్తయిన టవర్స్, గ్రీనరీ ఉట్టిపడేలా కట్టడాలు ఉంటాయని నమూనాలో చూపించారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్ రాజు, బండారు సత్యనారాయణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ శనివారం అమరావతి నమూనాను తిలకించారు. సందర్శకులు సైతం రాజధాని ఎలా నిర్మాణం కాబోతున్నదో చూసి మురిసిపోయారు.


సీఆర్డీఏ ప్రదర్శించిన అమరావతి నమూనా

సైకాలజిస్టు నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో కొత్తగా ఏర్పాటు చేసిన డ్రగ్ అడిక్షన్ సెంటర్‌లో తాత్కాలిక ప్రాతిపదికన సైకాలజిస్టుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాంతీయ కోస్తాంధ్ర జైళ్లశాఖ అధికారి ఎంఆర్ రవికిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారు వయసు 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. సైకాలజీలో పట్టభద్రుడు అర్హుడు. గుర్తింపు పొందిన డి-అడిక్షన్ కౌన్సెలింగ్ సర్టిఫికెట్ ఉండాలి. ఒకటి లేదా రెండేళ్ల అనుభవం గల వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తును కోస్తాంధ్ర రేంజ్ జైళ్ల శాఖ రాజమహేంద్రవరం, గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా, హెచ్‌పీసీఎల్ అవుట్‌లెట్ పక్కన, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా అనే చిరునామాకు డిసెంబరు 1లోగా పంపాలని సూచించారు.

తుప్పల తొలగింపు

వెంకోజీపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డులలోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన తుప్పలను జీవీఎంసీ సిబ్బంది టిప్పర్, బాబ్‌కాట్‌లతో శనివారం తొలగించారు. 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలోని ఖాళీ స్థలంలో తుప్పలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కొండ ప్రాంతంలో నివసిస్తున్న తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు తగిన స్థలం లేక రోడ్డుపైనే ఉంచుతున్నామని, ఈ తుప్పలను కొట్టివేయడంతో తమకు పార్కింగ్ స్థలం లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి మంచి పని చేపట్టిన 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్యకు, ప్రభుత్వ న్యాయవాది బుగత సత్యనారాయణ, 15వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మళ్ల రవికుమార్, ఉపాధ్యక్షుడు బోను సూరిబాబులకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాట శిబిరంపై దాడి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వలందపేట పంచాయతీ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను భీమిలి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి రూ. 34,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది దాడి చేశారని సీఐ తిరుమలరావు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తగరపువలస, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు చిట్టివలస, కొండపేట ప్రాంతాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరి సరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పి. శ్రీవాణి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన చేయరాదని, ఇళ్లలోని చెత్తను పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా. సుధాంస, నాగరాజు, సౌజన్య, రజనీ, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి (మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** :శ్రీకన్య, లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచర పాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 60, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 58, బీరకాయలు 58, ఆనపకాయ 40, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 26, క్యారెట్ 60, దొండకాయలు 60, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 46, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	605
విజయనగరం	609
శ్రీకాకుళం	609

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234


త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

కిటకిటలాడిన వైష్ణవాలయాలు

వెంకోజీపాలెం,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉపవాసాలతో ఇంటిలో పూజచేసుకుని, ఆలయానికి విచ్చేసి వేంకటేశ్వరస్వామిని భక్తితో కొలిచారు. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనానికి బారులు తీరారు. శ్రీవారిని తులసి మాలలతో అలంకరించారు. అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణశర్మ, వంశీకృష్ణ శర్మలు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి. సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న ముడుపుల వెంకన్నస్వామి ఆలయ ఇరుకు రోడ్డులో ఉన్నందున దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామ సేవా సంఘం సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.


కొత్త వెంకోజీపాలెం ఆలయం వద్ద భక్తులు


బహుమతులు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

కృష్ణా కళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

మద్దిలపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పరిశుభ్రత చేపట్టారు. మొక్కలునాటి చెత్తను తొలగించారు. విద్యార్థులు ఆరోగ్యం, పరిశుభ్రతపై వీధి నాటకాన్ని ప్రదర్శించగా వారికి బహుమతులు అందించారు.అనంతరం వైస్ ప్రిన్సిపాల్ వి.జయ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులు సంతోషంగా, ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవాపథకం జోనల్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు బి.లక్ష్మి, కె.బాలకృష్ణ, వి. పద్మజ, జీవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్కా.. మందుబాబులకు అడ్డానా?


పార్కులో మద్యం తాగుతున్న యువకులు

వెంకోజీపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉదయం చిన్నారులతో, షటిల్ ఆటగాళ్లతో సందడిగా కనిపించే పార్కు, ఆ తరువాత మందుబాబులతో నిండిపోతోంది. బహిరంగంగా మద్యం తాగితే పట్టుకుని శిక్షించాల్సిన పోలీసు సిబ్బంది చూసీచూడనట్టు ఉండటం తో ఆకతాయిలకు అడ్డూఆపూ లేకుండా పోయింది. ఇదీ 16వ వార్డు హెచ్‌బీకాలనీలోని అబ్దుల్ కలాం పార్కు దుస్థితి. పార్కుకు చుట్టుపక్కల ఉన్న స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్ ఖాళీ అయిపోవడంతో ఈ ప్రాంతంలో జనసంచారం లేక మందుబాబుల ఆగడాలకు అడ్డులేకుండా పోయింది.కానీ బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తీసుకోవాల్సిన బ్లూకోర్టు సిబ్బంది నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.దీంతో ఆకతాయిలు మరింతగా విర్రవీగిపోతున్నారు. అంతేకాకుండా 15వ వార్డు ఉక్కుకళావేదిక ప్రాంతంలో కూడా మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఆ మార్గంలో వెళ్లాలంటే మగాళ్లు సైతం భయాందోళన చెందే పరిస్థితి నెలకొంది. మందుబాబులు ఎక్కడ దౌర్జన్యం చేస్తారోనని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా వీరిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



విశాఖ పోర్టును సందర్శించిన నేపాల్, రష్యా బృందాలు

నేపాల్, రష్యా బృందాలు పోర్టు సందర్శన

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నేపాల్ నుంచి వచ్చిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం, రష్యా నుంచి విచ్చేసిన వ్యాపార బృందాలు శనివారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించాయి. నేపాల్ ప్రతినిధి బృందానికి నేపాల్ పరిశ్రమ, వాణిజ్య, సరఫరాల మంత్రి అనిల్‌కుమార్ సిన్హా నాయకత్వం వహించారు. ఆశాఖ సంయుక్త కార్యదర్శి బిపిన్ ఆచార్య, శాఖ ప్రతినిధి తరకరాజ్ భట్టా ఈ బృందంలో ఉన్నారు. రష్యా నుంచి వచ్చిన 11 మంది ప్రతినిధులు కూడా పోర్టును సందర్శించారు. పోర్టులో ఉన్న సౌకర్యాలు, సరకు రవాణా సామర్థ్యం, ఆధునికీకరణ, యాంత్రీకరణ, చర్యలు, కవర్డ్ స్టోరేజీ సౌకర్యాలు, సోలార్ పవర్, నీటి రీసైక్లింగ్ విధానాల గురించి ఈ బృందాలకు పోర్టు అధికారులు వివరించారు.

గంజాయి కేసులో పాత నేరస్తుడు అరెస్టు

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో పోలీసుల కళ్లు కప్పి ఆరేళ్లగా తిరుగుతున్న నిందితుడ్ని మల్కాపురం సీఐ అప్పారావు, సిబ్బంది శనివారం గాజువాక కోర్టు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం... కోరమాండల్ కంపెనీలో ఎరువుల లోడింగ్ పని కోసమని 2020 ఫిబ్రవరి 13న ఒడిశాలోని కరస్తాగూడా గ్రామానికి చెందిన బీజే కబాసి (37)ని తీసుకువచ్చారు. కబాసి లారీని సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేయగా క్యాబిన్‌లో 50.2 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. అప్పట్లో పోలీసుల కళ్లు కప్పి పారిపోయాడు. నాటి నుంచి ఆరేళ్లుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. ఈ విషయం సీపీ దృష్టికి వెళ్లడంతో నిందితుడ్ని వెంటనే అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు మల్కాపురం పోలీసులు వారం పాటు ఒడిశాలో ఉండి కబాసి కదలికలపై నిఘా ఉంచారు. కబాసి బెయిల్ కోసం గాజువాక లాయర్‌ను సంప్రదించాడు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కబాసి గాజువాక ప్రాంతంలోనే ఉన్నాడని పోలీసులు చెప్పారు.

దుస్తులు పంపిణీ

కొమ్మాది, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఆరో వార్డు పరిధిలోని పీఎంపాలెం పాత పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ప్రజారోగ్య శాఖ సిబ్బందికి జీవీఎంసీ యూఎల్‌బీ ద్వారా దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గరే గురునాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనందబాబు, ఆరోవార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డిసత్యనారాయణ,జనసేన వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, పోలిసెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు. కాగా గురు నాథ్‌ను ఆరో వార్డు యూసీడీ విభాగం సీఓ పాపారావు, ఆర్‌పీలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, కొల్లి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి అమలులో విశాఖ నంబర్ వన్

- పూర్తిస్థాయిలో పథకం విజయవంతం
- రవాణా శాఖా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం పూర్తిస్థాయిలో విజయవంతమయిందని, విశాఖ రీజియన్ నంబర్‌వన్‌గా నిలిచిందని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ద్వారకాకాంప్లెక్సును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్సు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిందని, నవంబరు నెలాఖరు వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల చార్జీలు రూ.400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని, ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 13న జీవో జారీ చేశారన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కొత్తబస్సులు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ డెంటల్ డాక్టర్ సంతోష్ అందజేసిన రూ.3.2 లక్షల విలువచేసే 1,620 ప్రథమ చికిత్స కిట్‌లను విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డికి అందజేశారు. వాటిని జోనల్ పరిధిలోని అన్ని బస్సుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖ ఆర్ఎం బి.అప్పలనాయుడు, అధికారులు కె.పద్మావతి, గంగాధర్, గంగాధరరావు, ఉమామహేశ్వరరెడ్డి, మణిమాధురి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి స్టాల్స్‌లో వస్తువులను ఎమ్మార్పీకే అమ్మాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాలపై మహిళా ప్రయాణికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ఆకాశ్ ప్రతిభ

ఆరిలోవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో ఈఏడాది ఏప్రిల్‌లో పదో తరగతి ఉత్తీర్ణుడై నూజివీడులో ట్రిపుల్ ఐఐటీలో చదువుతున్న పొన్నకాయల ఆకాశ్‌కు సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ మేథమెటిక్స్ విభాగంలో ఏపీలో ప్రథమస్థానం వచ్చింది. భోపాల్‌లో జరగనున్న జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ రత్న వల్లి తెలిపారు. ఉత్తరాంధ్ర నుంచి ఈ ఒక్క ప్రాజెక్టు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. 40 ఏళ్ల గురుకుల చరిత్రలో ఇది ఒక మైలురాయి అని ఆమె తెలిపారు. ఈ ప్రాజెక్టు తయారీలోసహకరించిన గణిత ఉపాధ్యాయుడు సంపతి లక్ష్మణరావు రూపొందించిన యూజ్ ఆఫ్ మేథమెటికల్ మోడ లింగ్ ఇన్ స్వచ్ఛ భారత్ అనే అంశంపై సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి వచ్చింది. ఈనెల 18 నుంచి 24 వరకు భోపాల్ (మధ్యప్రదేశ్)లో జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరగనుంది. విద్యార్థి ఆకాష్‌ను అనకాపల్లి, విశాఖ గురుకులాల సమన్వయకర్త గ్రేస్, ప్రిన్సిపాల్ రత్నవల్లి, అభినందించారు.

పాండ్రంగిలో నేత్ర వైద్య శిబిరం

పద్మనాభం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పాండ్రంగి గ్రామంలో భగవాన్ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థ విశాఖ జోన్, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈశిబిరంలో వంద మందికి వైద్యులు పరీక్షలు చేశారు.35 మందిని శస్త్ర చికిత్స చేయడానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి కె. రామరాజు, కె. అప్పలరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పి. నారాయణమ్మ, బి. సంతోషి, కొసర అప్పలనాయుడు, పి. శ్రీను, సత్యసాయి సేవా సంస్థల జోనల్ కోఆర్డినేటరు ఎంపీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మళ్లీ వెలుస్తున్న తోపుడు బళ్లు

ఖాళీ స్థలంపై కన్ను!

ఆరిలోవ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధికి చెందిన 12వ వార్డు సచివాలయానికి సమీపంలో గల సర్వీసు రోడ్డుకు ఆనుకొని పచ్చదనం (గ్రీనరీ) పూర్తిగా హరించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు రాజకీయ నాయకుల జోక్యంతో ఇక్కడ మొక్కలు తొలగించారు. డివైడర్ల చుట్టూ లక్షలాది రూపాయలను జీవీఎంసీ వెచ్చించి కంచె కూడా వేసింది. ప్రస్తుతం అది కూడా మాయమైంది. ఇప్పుడు అక్కడ ఖాళీ స్థలం కనిపించడంతో దీనిపై కొందరి కన్ను పడింది. ఇందులో చిరు వ్యాపారులు తోపుడు బళ్లు పెట్టి వ్యాపారం చేస్తున్నారు. అటువైపు బీఆర్‌టీఎస్ రోడ్డు ఉండటంతో పార్కింగ్ సమస్య కూడా తలెత్తుతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకొని ఎలాంటి దుకాణాలు పెట్టరాదని గతంలో జీవీఎంసీ కమిషనర్ ఆదేశించినా కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు.

ఘనంగా బిర్సా ముండా జయంతి


బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పెదవాల్తేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగర బీజేపీ కార్యాలయంలో భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం ఎంఎన్ పరశురామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొని భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో గిరిజనుల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం పోరాడిన మహానుభావుడని శ్లాఘించారు. గెరిల్లా యుద్ధ పోరాటం చేసిన యోధుడు, ఆయుర్వేదం, జానపదాలలో అగ్రగణ్యుడు బిర్సా ముండా జయంతిని జనజాతీయ గౌరవ్ దివస్‌గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారని అన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 11 గంటలకు పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఎం.నాగేంద్ర, ఎన్.విజయేంద్ర రెడ్డి, ఎస్ఆర్ఎల్ఎస్ మురళీమోహన్ రాజు,పూజారి నగయ్య, పూజారి ఆశీర్వాదం, శ్రీరంగం ధనేశ్వరరావు, దాడి పురుషోత్తం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పడిపూజ

వెంకోజీపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం పడి పూజ మహోత్సవం నిర్వహించనున్నట్టు గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సీతంపేటలో అతిథిగృహ భవనం ప్రారంభం

సీతంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గ పరిధి 25వ వార్డు సీతంపేట కనకమ్మ ఆలయం వద్ద శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరం, అతిథి గృహ భవనాన్ని శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ (దక్షిణ), పి.విష్ణుకుమార్‌రాజు (ఉత్తర) లు శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్గనిర్దేశకుడు అంబేడ్కర్


విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గొల్ల బాబూరావు, కె.కె.రాజు, ఆర్.వెంకటరమణ తదితరులు

మాధవధార, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఒక్క కులానికి నాయకుడు కారని, యావత్ దేశానికి మార్గనిర్దేశనం చేసిన మహోన్నతుడన్న విషయం అందరూ తెలుసుకోవాలని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. డాక్టర్ భీంరావ్ ఎస్సీ సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ 51వ వార్డు మహత్‌కాలనీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్పొరేటరు ఆర్.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు కె.కె. రాజు కూడా పాల్గొన్నారు. విగ్రహదాత వై.పైడిరాజు, వైసీపీ ఎస్సీసెల్ నాయకుడు బి.శివరామకృష్ణ, సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా

సీతమ్మధార, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ కవర్‌లను వినియోగించకుండా వ్యాపారులు నార సంచులు వాడాలని జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్‌ఎస్‌లు సూచించారు. మద్దిలపాలెం, చైతన్యనగర్, కెఆర్‌ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు, చిరు దుకాణాల వద్ద శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తున్న వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని కొనసాగిస్తే రెట్టింపు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు అయిదుగురు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు వీరే

మురళీనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైశాఖీ స్పోర్ట్సు పార్కులోని ఈతకొలనులో శిక్షణ పొందిన అయిదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పార్కు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పి.వి.ఎస్.రాజు పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి విజయవాడలో జరిగే పోటీల్లో మురళీనగర్ ప్రాంతానికి చెందిన కె.శ్యామ్, బి.తీక్షిత రెడ్డి, బి.కేతన్, బి.మురళి, కె.జోషిత ఎంపికయ్యారని తెలిపారు. రామారావు శిక్షణలో వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్య వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పాఠశాలకు స్కోర్ బోర్డు వితరణ

అక్కయ్యపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు మంజు క్రియేషన్స్ నిర్మాతలు శ్రీనివాస నాయుడు, శ్రీరాములు, వైజాగ్ సినీ లోకల్ మేనేజర్ అర్జి బాల గంగాధర్ స్కోర్ బోర్డు బహూకరించారు. ఈ బోర్డును ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు ఘన నివాళి


కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమాన సంఘం ప్రతినిధులు

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత సినీనటుడు, సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ వర్ధంతి సందర్భంగా అభిమానులు శనివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గ్రేటర్ విశాఖ సిటీవైడ్ కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరస్వతీ పార్కు. సంఘం అధ్యక్షుడు డొప్పా రమణ, కార్యదర్శి కాకి సోంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నాల శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలు, వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కృష్ణ 350 సినిమాలలో హీరోగానూ, రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న సూపర్‌స్టార్ అని శ్లాఘించారు. చలనచిత్ర పరిశ్రమ ఉన్నంత వరకు ఆయన జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని అన్నారు. అభిమానులు కె.కమల్‌కుమార్, నీలాపు శ్రీనివాసరావు, చిన్నా, వెంకటరావు, సారిపల్లి శంకర్, అప్పన, గోవింద్ పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు


థింసా నృత్యం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తదితరులు

గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం కృషి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు
- టీసీఆర్ టీఎంలో ముగిసిన జన జాతీయ గౌరవ్ దివస్ వేడుకలు

సాగర్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సాగర్‌నగర్‌లోని ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ (టీసీఆర్‌,టీఎం) కార్యాలయంలో పదిహేను రోజులుగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ దివస్ (జేజేజీడీ), భగవాన్ బిర్సాముండా 150వ జయంత్యుత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ చరిత్రలో కనుమరుగైన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించి, గౌరవం ఇవ్వడానికి ప్రధాన మంత్రి మోదీ చేపట్టిన జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమం ఒక చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.గిరిజన విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం ఎంతో గర్వకారణమన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ఐటీడీఏల్లో ఐఏఎస్ అధికారులను నియమించడం వల్ల పరిపాలన మరింత పారదర్శకంగా గిరిజనులకు దగ్గరగా మార్చిన విషయాన్ని ప్రస్తావించారు. జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ వేడుకలను విజయవంతంగా నిర్వహించిన టీసీఆర్ టీఎం బృందాన్ని అభినందించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సమిధాసింగ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రూ.600 కోట్లతో గిరిజన ప్రాంత రహదారులు, గృహ నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించినట్టు వెల్లడించారు. తొలుత సంప్రదాయ నృత్యాలతో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు ఆహ్వానం పలికారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన గిరిజన ఉత్పత్తులు, సంప్రదాయ పరికరాలు తదితర వస్తువులను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సదాభార్గవి, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి, టీసీఆర్‌టీఎం అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో ఏకాదశి శోభ


సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

మాధవధార, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా వివిధ వైష్ణవాలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. మాధవధార ఆర్‌అండ్‌బి జంక్షన్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతం చేపట్టారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవలు, పూజల అనంతరం ఆవరణలో పండితులు నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో వందలాదిగా భక్తులు హాజరయ్యారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన చేపట్టారు. వేడుకల్లో ప్రధాన అర్చకులు గోపి, ఎ.వేణుగోపాల ఆచార్యులు స్వామి వారికి ఉత్సవ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 49వ వార్డు మురళీనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు నిర్వహించారు.

దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం


దేవదాయశాఖ మంత్రి ఆనంకు ఆహ్వానపత్రిక అందిస్తున్న ఈవో

మహారాణిపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మార్గశిర మాసోత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని ఆహ్వానించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి కె.శోభారాణి అమరావతి వెళ్లి మంత్రిని మర్యాద పూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవ ఏర్పాట్లను ఆమె మంత్రికి వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేవదాయ శాఖ తరఫున సహాయ సహకారాలు అందజేస్తామని, తగిన కార్యాచరణ ప్రణాళికతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంత్రి సూచించారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి తులసీదళార్చన

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శనివారం తులసీ దళార్చన, ఆయుష్ హోమం నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విశాఖ నుంచి అంతర్జాతీయ కార్గోకు పచ్చజెండా

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో రవాణాకు అనుమతులు మంజూరు చేసినట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం ప్రకటించారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం(అపాటా) తెలిపింది. కొవిడ్ సమయంలో ఈ సేవలు నిలిచిపోగా ఆ తరువాత పునరుద్ధరించలేదు. అనేక ప్రయత్నాల మీదట ఇప్పుడు అనుమతి వచ్చింది. ప్రస్తుతం విశాఖ నుంచి సింగపూర్‌కు, అబుదాబీకి అంతర్జాతీయ విమానాలు నడుస్తున్నాయి. వాటిలో ఇకపై సరకు రవాణా చేసుకోవచ్చునని అపాటా ప్రతినిధులు కుమార్ రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు తెలిపారు. కార్గోకు పచ్చజెండా ఊపడం ప్రయాణికులకు మేలిమలుపు.

వినోదాన్ని పంచిన హాస్య వల్లరి


స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా క్రియేటివ్ కామెడి క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వినోద వల్లరిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కృష్ణా యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ జి.జ్ఞానమణి, రైటర్స్ అకాడమి చైర్మన్ వి.వి.రమణమూర్తి, ఏయూ అడహక్ ప్రొఫెసర్ ఉషా చీరాల తదితరులు సందేశాలు వినిపించారు. విశాఖ హ్యూమర్ క్లబ్, క్రియేటివ్ కామెడి క్లబ్, ఫ్రైండ్స్ కామెడీ క్లబ్, లాఫింగ్ ఫన్ క్లబ్, హాస్యప్రియ కామెడి క్లబ్, హాస్య దర్బార్ సభ్యులు, కళాకారులు ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. కార్యక్రమంలో భాగంగా ఆకాశవాణి విశ్రాంత అధికారి, నటులు, పుస్తక ప్రియులు, అక్షర ప్రేమికులు బేతా రామసూర్య ప్రకాశరావును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందచేశారు. ఈ కార్యక్రమంలో మేడా మస్తాన్ రెడ్డి, కొణతాల రాజు, కొణతాల సురేష్, టి.లక్ష్మీప్రసాద్, వి.రామ్‌కుమార్, ఎం.సాయి సుప్రియ, పంతుల లలిత, హాస్యప్రియులు పాల్గొన్నారు..

'హ్యాట్సాఫ్ పోలీస్' లఘు చిత్రానికి అవార్డులు


ఉత్తమ దర్శకుడు, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ అవార్డులు స్వీకరిస్తున్న జీవీ త్రినాథ్, ఉదయ్

డాబాగార్డెన్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఆర్టిస్టులతో నిర్మించిన 'హ్యాట్సాఫ్ పోలీస్' లఘు చిత్రానికి అంతర్జాతీయ అవార్డు లభించింది. ఉత్తమ దర్శకుడిగా జీవీ త్రినాథ్, ఉత్తమ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా ఉదయ్ అవార్డులు పొందారు. అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని రెయిన్ బో చిల్డ్రన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా షార్ట్ ఫిల్మ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిల్మ్ డైరెక్టర్ చంద్రమహేష్, సెన్సార్ బోర్డు సభ్యురాలు పద్మిని నాగులపల్లి, రెవెన్యూ అధికారి సత్యానందం, నటభూషణ్ శోభన్‌బాబు మేనల్లుడు శోభన్‌రాజన్ చేతులమీదుగా అవార్డులు స్వీకరించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు జీవీ త్రినాథ్ మాట్లాడుతూ లఘు చిత్రానికి అంతర్జాతీయ అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. సమాజాన్ని జాగృతం చేయడమే తమ చిత్రాల లక్ష్యమన్నారు. తాము ఇదివరకు తెరకెక్కించిన అంతిమయాత్ర, జగపతిగారి మనవరాలు వంటి లఘు చిత్రాలు సైతం అనేక అవార్డులు సాధించుకున్నాయన్నారు. ప్రజలను మంచిదారిలో తీసుకెళ్లడమే నా ఉద్దేశమన్నారు. లఘు చిత్రంలో నటించిన నగరానికి చెందిన ప్రతీ ఆర్టిస్టు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

సాంస్కృతిక సంబంధాలపై ప్రసంగం


నేపాల్‌లో డా.జయలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'భారత్-నేపాల్ సాంస్కృతిక సంబంధాలు' అనే అంశంపై నేపాల్‌లోని జనకపూర్, కాఠ్మాండూ, పోఖరా నగరాల్లో నవంబరు 11, 12, 13 తేదీల్లో నిర్వహించిన మూడు అంతర్జాతీయ సదస్సుల్లో భారతదేశం తరఫున స్థానిక సెయింట్ జోసెఫ్ విశ్రాంత హిందీ విభాగాధిపతి, కళాశాల పీఆర్‌ఓ డా.పి.కె. జయలక్ష్మి ప్రాతినిధ్యం వహించారు. ఈ సదస్సులు హిందీ సాహిత్య భారతీ ఇంటర్నేషనల్, గ్లోబల్ పీస్ ఫౌండేషన్, నేపాల్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. సనాతన సంస్కృతి పరిరక్షణ, భారత్-నేపాల్ సాంస్కృతిక సంబంధాలపై ఆమె కీలక ప్రసంగాలు చేసి ఆహూతుల ప్రశంసలు పొందారు. డా.నిరంజన్ కుమార్, ప్రొ.డా.రామ్ లోహన్ పంత్, డా.రవీంద్ర శుక్లా తదితర ప్రముఖులు రెండు దేశాల మైత్రి, సాంస్కృతిక అనుబంధాలను బలపరచడంలో ఈ సదస్సుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా డా.జయలక్ష్మిని గ్లోబల్ పీస్ ఫౌండేషన్ (నేపాల్) ఘనంగా సత్కరించింది.

డీఆర్‌ఎం ఫుట్‌బాల్ కప్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్‌ఎం, అధికారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తారైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ వాల్తేరు డివిజన్ నిర్వహించనున్న డీఆర్‌ఎం కప్ ఆలిండియా ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రచార పోస్టర్‌ను డీఆర్‌ఎం లలిత్ బొహ్రా శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వాల్తేరు రైల్వే స్టేడియం వేదికగా డిసెంబరు 14 నుంచి 21 వరకు ఫ్లడ్ లైట్ల వెలుతురులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ టోర్నీలో వివిధ ప్రాంతాలకు చెందిన 12 జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ విశాఖలో ఫుట్‌బాల్ క్రీడకు ఉన్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలు తలెత్తకుండా టోర్నీని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం ఈ.శాంతారామ్, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎం.హరినాథ్, అడ్వైజర్ ఎ.కె.మహరాణా , సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, సహాయ క్రీడాధికారులు సుమిత్ వర్మ, పాటిల్, సాహు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఉష, రైల్వే ఫుట్‌బాల్ కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

నాయకత్వం బలంగా ఉంటే ప్రగతి: ఎమ్మెల్యే వంశీకృష్ణ


జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాయకత్వం బలంగా ఉన్నచోట అభివృద్ధి జరుగుతుందని, ప్రగతి కనిపిస్తే ప్రజలు కూడా ఆకర్షితులవుతారని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. 30వ వార్డులో జనసేన నాయకత్వం బలంగా ఉన్నందున ప్రజలు జనసేన పట్ల ఆకర్షితులవుతున్నారని ముక్తాయించారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల జనసేన కార్యాలయంలో శనివారం వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో కోరిపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి సుమారు వంద మంది మహిళలు, యువకులు జనసేనలో చేరారు. యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని పవన్ కల్యాణ్ ఎప్పుడూ చెబుతుంటారని, మీకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ హామీ ఇచ్చారు. సాలిపేట ఏరియాకి చెందిన ఎల్.రాజు, జనార్ధన్, వినయ్, అప్పలరాజు, యేసు, నాగరాజు, ఎంవీఎస్‌ఎన్ మూర్తి, పి.కృష్ణ, రాజేష్, కిరణ్, ఈశ్వరరావు, లక్ష్మి, మంగవేణి, త్రివేణి, అధిక సంఖ్యలో యువకులు పాల్గొన్నారు. 30వ వార్డు సత్యనారాయణ స్వామి ఆలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ వైసీపీ నుంచి జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు జనసేన అధ్యక్షుడు యజ్ఞశ్రీ, నాయకులు వినయ్, శంకర్, వీరమహిళలు పాల్గొన్నారు.

ఏపీలో రూ.5 వేల కోట్లతో గోవా షిప్‌యార్డ్స్ ప్రాజెక్టు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోవా షిప్ యార్డ్స్ ప్రాజెక్టు హెడ్ ఆదికేష్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. రెండోరోజు సదస్సులో ఆయనతో సమావేశమైన మంత్రి లోకేష్ రూ.5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు గోవా షిప్‌యార్డ్ సంస్థ రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సంస్థ హెడ్ ఆదికేష్‌ను అభినందించారు. 1057 కిలోమీటర్ల సువిశాల తీర ప్రాంతం కలిగిన ఏపీలో పెట్టుబడులు పెట్టడం సరైన నిర్ణయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్టు హెడ్ ఆదికేష్ వాసుదేవన్ మాట్లాడుతూ తాము నిర్మించబోయే షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ద్వారా 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ దేశంలోని ప్రముఖమైన, అత్యంత ఆధునిక రక్షణ షిప్‌యార్డ్‌ల్లో ఒకటిగా ఉందన్నారు.

జెలెస్ట్రా పవర్ సీఈవోతో మంత్రి భేటీ

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ విడి భాగాల తయారీ యూనిట్ ఏర్పాటుచేయాలని జెలాస్ట్రా పవర్ సీఈవో పరాగ్ శర్మను మంత్రి నారా లోకేష్ కోరారు. భాగస్వామ్య సదస్సు రెండోరోజైన శనివారం పరాగ్ శర్మతో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ ప్యానల్స్, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ స్టోరేజీ వ్యవస్థల కోసం ఏపీలో రెన్యుబుల్ ఎనర్జీ మానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విడిభాగాల ఎగుమతికి సౌలభ్యంగా ఉండేలా పోర్టు సమీపంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాల్సిందిగా కోరారు. అనంతరం జెలెస్ట్రా పవర్ సీఈవో పరాగ్‌శర్మ మాట్లాడుతూ హరియాణాలోని గురుగావ్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ వర్టికల్ ఇంటిగ్రేటెడ్ రెన్యుబుల్ ఎనర్జీ డెవలపర్‌గా, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ఉందన్నారు. యుటిలిటీ స్కేల్ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి, కనస్ట్రక్షన్ రంగాల్లో తాము సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది రూ.579 మిలియన్ పౌండ్ల వార్షికాదాయం కలిగిన తమ సంస్థ ఏడు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోందని వెల్లడించారు.

ఎట్టకేలకు రహదారులకు మోక్షం


కృష్ణాగార్డెన్స్ మలుపు నుంచి అంబేడ్కర్ జంక్షన్‌కు వెళ్లే నూతన రహదారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డాబాగార్డెన్స్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి భీమ్‌నగర్, కృష్ణాగార్డెన్స్, వివేకానంద సర్కిల్ రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో 'అధ్వాన రహదారులతో అవస్థలు' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం నుంచి నూతన రహదారుల నిర్మాణం చేపట్టారు. కృష్ణాగార్డెన్స్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ తిరిగే మలుపులో నూతన రహదారులతో పాటు భీమ్‌నగర్ డిస్పెన్సరీ ఎదురుగా ఇరువైపులా రహదారులు వేశారు. చాలా కాలంగా సమస్యలతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి, ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఎన్నో ఉన్నాయి. దీంతో ఆంధ్రజ్యోతి పలుమార్లు కథనం ప్రచురించడంతో ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లడంతో నూతన రహదారులు వేశారు. ఆయా ప్రాంతాలన్నీ ప్రస్తుతం కళకళలాడుతున్నాయి.

చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా రియర్ అడ్మిరల్ గౌతమ్‌మార్వహా



విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పు నావికాదళం ప్రధానకార్యాలయం చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (టెక్నికల్)గా రియర్ అడ్మిరల్ గౌతమ్ మార్వహా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1992లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా ఇండియన్ నేవీలో చేరారు. నేవల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో నవాలా, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ విల్లింగ్టన్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్ న్యూఢిల్లీలో ఫ్లాగ్ ఆఫీసర్ కోర్సులను పూర్తిచేశారు. అనంతరం ఐఎన్ఎస్ గోమతి, ఐఎన్ఎస్ నిర్ఘాట్, ఐఎన్ఎస్ త్రిసూల్‌లో ఫ్లాగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ప్రెడెంట్ కలర్ అవార్డును, విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు.

అధికారులకు సీఎం అభినందనలు

... 5వ పేజీ తరువాయి

ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్‌జామ్‌లకు అవకాశం లేకుండా 'అస్త్రం' యాప్ ద్వారా పర్యవేక్షించారు. సదస్సు ప్రాంగణంలోనే కమాండ్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించేలా ఐపీఎస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ప్రజలు, ప్రతినిధులపట్ల గౌరవంగా వ్యవహరించాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. డ్యూటీలో ఉన్నచోటకే భోజనం సరఫరా చేస్తామని చెప్పడంతో సిబ్బంది ఉన్న చోటే సమర్థంగా విధులు నిర్వర్తించారు.

సదస్సు సూపర్ సక్సెస్

... 5వ పేజీ తరువాయి

అంతా దగ్గరుండి ఏర్పాట్లు చూసుకున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించుకుంటూ లోపాలను సరిదిద్దుకున్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పోలీసులు ఎక్కడా అతిగా ప్రవర్తించకుండా ముందుగానే హెచ్చరికలు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. రెండు రోజుల సదస్సు పూర్తిగా విజయవంతం కావడంతో సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ అధికారులను, స్థానిక నాయకులను శనివారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఆ ఉత్సాహంతోనే వచ్చే సదస్సు కూడా నవంబరు 2026లో ఇక్కడే నిర్వహిస్తామని చంద్రబాబు ప్రకటించారు.

ఐటీ కంపెనీల్లో రాష్ట్ర యువతకు ప్రాధాన్యం

... 5వ పేజీ తరువాయి

ఎంఓయూ చేసిందన్నారు.

అది ఎక్స్‌పీరియన్స్ సెంటర్

విశాఖలో ఐటీ ఉద్యోగులకు సోషల్ లైఫ్ కావాలని, ఈ నేపథ్యంలోనే లూలూ మాల్‌ను పెడుతున్నామన్నారు. అది షాపింగ్‌కే పరిమితం కాదని, ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖ స్టీల్, కొత్తగా అనకాపల్లి జిల్లాలో వచ్చే ఆర్సెలర్ మిట్టల్ ద్వారా దేశంలోనే అత్యధిక స్టీల్ తయారవుతుందన్నారు. మిట్టల్ స్టీల్ కోసం ఎన్ఎండీసీ నుంచి ముడిఇనుమును పైపులైన్ ద్వారా తెప్పించడానికి ప్రధాని నరేంద్రమోదీతో ఆ శాఖకు చెప్పించాల్సి వచ్చిందని వివరించారు. వారు దశల వారీగా రూ.1,35,000 కోట్ల పెట్టుబడి పెడతారన్నారు. తూర్పు తీరంలో పోర్టుల ద్వారా పశ్చిమ తీరంలో పోర్టులకు కనెక్టివిటీ పెంచుతున్నామని, దానిద్వారా లాజిస్టిక్స్ వ్యయం తగ్గుతుందన్నారు. దసపల్లా , నాగార్జున కనస్ట్రక్షన్ కంపెనీ భూములు చేతులు మారిపోయాయని, వాటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని ఓ విలేకరి ప్రశ్నించగా, చట్టప్రకారం ముందుకు వెళతామన్నారు.

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఎలా జరుగుతుంది?

స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆగినట్టా?, లేదా?...అని ఓ విలేకరి ప్రశ్నించగా సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. కేంద్రం రూ.12 వేల కోట్లు ఇచ్చింది దేనికని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం ఉంటే ఇస్తారా?...అని నిలదీశారు. ప్రైవేటీకరణ ఆగిందని ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి చెప్పాలా? అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల విద్యుత్ బకాయిలను ఈక్విటీగా మార్చిందని, నీటి పన్ను, ఆస్తి పన్ను వదులుకుందని, సెక్యూరిటీ కూడా ఇచ్చిందని, ఇదంతా దేని కోసమని ప్రశ్నించారు. పనిచేయకుండా పడుకుంటే నష్టాలు రావా? అన్నారు. అందుకే కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు.


పూజ చేస్తున్న మేయర్ పీలా

వెంకటాద్రిపై సామూహిక సత్యనారాయణ వ్రతాలు

పెందుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైన శ్రీవారి ఆలయంలో శనివారం కార్తీక శుద్ధ ఏకాదశి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నగర మేయరు పీలా శ్రీనివాసరావు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సన్నిధి కల్యాణ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మంది దంపతులు ఈ వ్రతంలో పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో..

ఆటోనగర్: కార్తీక మాసం శనివారం ఏకాదశిని పురస్కరించుకుని 87 వార్డు లక్ష్మీపురంలో త్రిశక్తుల అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వ్రతాలు చేశారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణాలు, భక్తి గీతాల ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషి'

పెందుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని టీడీపీ మండల అధ్యక్షుడు కునుగంటి కనరాజు అన్నారు. పెందుర్తిలో ఉన్న టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి అందేలా కృషి చేస్తానని అన్నారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ చేపడుతున్న కార్యక్రమాలను విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తామన్నారు.

వైభవంగా కార్తీక ఏకాదశి పూజలు

అగనంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి శనివారాన్ని పురస్కరించుకుని అగనంపూడి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతినగర్‌లో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అలాగే పెదమడక, పాత అగనంపూడి, కర్రివానిపాలెం, జాబిలి హిల్స్ ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

విజయరాఘవ స్వామి ఆలయంలో

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మాసం బహుళ ఏకాదశి సందర్భంగా తుంగ్లాంలోని విజయ రాఘవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **కాంత** : మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), కామేశ్వరి(మద్దిలపాలెం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),
- **జిగ్రీస్** : జగదాంబ
- **శివ, రన్నింగ్ మాన్** : శారదా
- **దే దే ప్యార్ దే** : రమాదేవి
- **సంతాన ప్రాప్తిరస్తు** : శ్రీవెంకటేశ్వర, కిన్నెర (మద్దిలపాలెం), శ్రీకన్య హెవెన్ (గాజువాక)
- **ది గర్ల్ ఫ్రెండ్** : శ్రీకన్య లీలామహల్, కిన్నెర (మద్దిలపాలెం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : నరసింహ (గోపాలపట్నం), కన్య (గాజువాక),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 39, వంకాయలు (తెలుపు) 54, వంకాయలు (నలుపు) 68, బెండకాయలు 56, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 64, బీరకాయలు 58, ఆనపకాయ36, కాలీఫ్లవర్ 48, క్యాబేజి 27, క్యారెట్ 56, దొండకాయలు 62, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 64, బరబాటి 52, ముల్లంగి 48, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 60, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 60, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 50, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 50, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 30, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 7, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	605
విజయనగరం	609
శ్రీకాకుళం	609

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	107
లైవ్ ధర	127
విత్ స్కిన్	224
స్కిన్‌లెస్	234

స్త్రీశక్తి అమల్లో విశాఖ నంబర్ వన్

» పూర్తిస్థాయిలో పథకం విజయవంతం
» రవాణాశాఖా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి


ఆర్టీసీ ద్వారకాకాంప్లెక్సులో పర్యటిస్తున్నరవాణా శాఖామంత్రి రామ్‌ప్రసాదరెడ్డి

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం పూర్తిస్థాయిలో విజయవంతమయిందని, విశాఖ రీజియన్ నంబర్‌వన్‌గా నిలిచిందని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ద్వారకాకాంప్లెక్సును శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంప్లెక్సు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చిందని, నవంబరు నెలాఖరు వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల చార్జీలు రూ.400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని, ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 13న జీవో జారీ చేశారన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కొత్తబస్సులు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ డెంటల్ డాక్టర్ సంతోష్ అందజేసిన రూ.3.2 లక్షల విలువచేసే 1,620 ప్రథమ చికిత్స కిట్లను విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డికి అందజేశారు. వాటిని జోనల్ పరిధిలోని అన్ని బస్సుల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖ ఆర్ఎం బి.అప్పలనాయుడు, అధికారులు కె.పద్మావతి, గంగాధర్, గంగాధరరావు, ఉమామహేశ్వరరెడ్డి, మణిమాధురి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి స్టాల్స్‌లో వస్తువులను ఎమ్మార్పీకే అమ్మాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాలపై మహిళా ప్రయాణికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శ్రీవారి సేవలో కేంద్ర మంత్రి


ప్రత్యేక పూజలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

కూర్మన్నపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88 వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీ శ్రీవారి ఆలయంలో నిర్వహించిన ఆకాశ దీపోత్సవంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైజాగ్ ప్రొఫైల్స్ ఎండీ బండి సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో రామ్మోహన్ నాయుడికి స్వాగతం పలికారు. పూజల అనంతరం ప్రసాదం స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ బండి సురేశ్ కుమార్, పద్మజ, డైరెక్టర్లు, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

గోపాలపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. అనంతరం డాక్టర్ సుజాత మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన వల్ల కలిగే అనర్థాలను, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్య సమస్యలకు చెక్

అగనంపూడి: ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను తప్పకుండా పాటించాలని ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీ కృష్ణ సూచించారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్య సమస్యలు దరి చేరవన్నారు. అనంతరం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా లక్ష దీపోత్సవం


దేదీప్యమానంగా వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం

కూర్మన్నపాలెం,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం గ్రీన్‌సిటీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం గోవిందనామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా వైజాగ్ ప్రొఫైల్స్ గ్రూపు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, లక్ష దీపోత్సవం కన్నుల పండుగలా జరిగింది. ముందుగా శ్రీవారికి బంగారు వెండి ఆభరణాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ప్రొఫైల్స్ ఎమ్‌డీ బండి సురేశ్ కుమార్, డైరెక్టర్ వీవీ.కృష్ణారావు, బీజేపీ నాయకులు జీవీఎల్‌నరసింహారావు, కరణంరెడ్డి నరసింగరావు, తదితరలు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల జారీ

అగనంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో ఈనెల 18 నుంచి సదరం సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్టు ఆస్పత్రి పరిపాలనా విభాగం అధికారి (ఏవో) రవిరాజా శనివారం ప్రకటనలో తెలిపారు. గాజువాక నియోజవర్గం పరిధిలో ఆర్థోపెడిక్ సంబంధిత దివ్యాంగులకు మాత్రమే ఇక్కడ సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ మంగళవారం ఆస్పత్రిలో సర్టిఫికేట్లను జారీ చేస్తామని తెలిపారు. సర్టిఫికెట్లు కోసం సచివాలయాల్లో ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

ఈనెల 17న గోపాలపట్నంలో

గోపాలపట్నం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం లోకోమోటర్ హెల్త్ క్యాంపు 17న నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత తెలిపారు. ఈ క్యాంపులో పాల్గొనేవారు తమ ప్రాంతాల్లోని సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

బాలాజీనగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

పెందుర్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 95వ వార్డు బాలాజీనగర్‌లో రూ.39.5 లక్షల కార్పొరేషన్ నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ముమ్మన దేవుడు శనివారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

ఆటోనగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి సచివాలయంలో పారిశుధ్య సిబ్బందికి దుప్పట్లు, నిత్యావసర సరకులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో చేసిన సేవలను వర్ణించ లేమన్నారు.

దత్తతపై అవగాహన

అగనంపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో దత్తత మాసోత్సవాలను పురస్కరించుకుని దత్తత గురించి శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఐ.సులేఖ దత్తత గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనాథలను ఏ విధంగా దత్తత తీసుకోవాలో తెలియజేశారు. అనంతరం పోక్సో, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న అమరావతి నమూనా

» తిలకించిన ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేల బృందం


అమరావతి నమూనాను తిలకిస్తున్న జిల్లా శాసనసభ్యులు

సిరిపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన దేశ, విదేశీయులను అమరావతి నమూనా విశేషంగా ఆకట్టుకుంది. సమ్మిట్ కాన్ఫరెన్స్ హాల్స్‌కు వెళ్లే దారిలో సీఆర్డీఏ అధికారులు రూపొందించిన అమరావతి డిజైన్ ప్రదర్శనకు ఉంచారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఎలా రూపాంతరం చెందబోతుందో కళ్లకు కట్టినట్లుగా నమూనాలో చూపించారు. అక్కడ ఫొటోలు తీసుకునేందుకు విదేశీయులు సైతం ఎంతో ఆసక్తి కనబరిచారు. అమరావతిలో ఎత్తయిన టవర్స్, గ్రీనరీ ఉట్టిపడేలా కట్టడాలు ఉంటాయని నమూనాలో చూపించారు.

ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్ రాజు, బండారు సత్యనారాయణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ శనివారం అమరావతి నమూనాను తిలకించారు. సందర్శకులు సైతం తమ భవిష్యత్ రాజధాని ఎలా నిర్మాణం కాబోతున్నదో చూసి మురిసిపోయారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం


తగలబడిపోతున్న ఇళ్లు


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితుడు పతివాడ సత్తిబాబు తన ఇంట్లో ఉన్న బీరువాలో నగదు, బంగారం, బట్టలు పూర్తిగా తగలబడిపోయాయి. సత్తిబాబు కూలి పనులు చేసుకుని జీవిస్తుంటాడు. శనివారం కూడా సత్తిబాబు పని కోసం బయటకు వెళ్లాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో పక్కపక్కన్ను రెండిళ్లు తగలబడిపోయాయి. అలాగే మరో ఇంటికి సంబంధించి గురి సత్యవతి తన సొంత పనిమీద బంధువుల ఇంటికి వెళ్లడంతో ఆమె ఇంటిలో ఏం ఉన్నాయో? ఏం లేవో? తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే గణబాబు

శాంతిగిర కాలనీలో ఇళ్లు తగలబడిపోయి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ మరమ్మతులు వెంటనే చేయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన


గోపాలపట్నం: గ్రంథాలను పరిశీలిస్తున్న పాఠకులు

గోపాలపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎన్‌వీ.నరసింహం మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. గ్రంథాలయంలో 15వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

గ్రంథాల్లోనే అపారమైన జ్ఞానం

పెదగంట్యాడ: అపారమైన విజ్ఞానం గ్రంథాల్లోనే ఉంటుందని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ నిర్వాహణాధికారి వీవీ.రమణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు లభ్యమవుతాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. ముందుగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో గ్రంథాలయాల పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం

మల్కాపురం: పోటీ పరీక్షలకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. ఈ సమావేశానికి గ్రంథాలయాధికారి అజేయ్ కుమార్ అధ్యక్షత వహించగా, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ గొలగాని అప్పారావు

మల్కాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పోలీసుల కళ్లు కప్పి ఆరేళ్లగా తిరుగుతున్న నిందితుడిని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, సిబ్బంది గాజువాక కోర్టు సమీపంలో శనివారం పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోరమాండల్ కంపెనీలో ఎరువుల లోడింగ్ పనుల కోసమని 2020 ఫిబ్రవరి 13న ఒడిశ్శాలోని కరస్తాగూడా గ్రామానికి చెందిన బీజే కబాసి(37)ని తీసుకువచ్చారు. అయితే కబాసి లారీని సెక్యూరిటీ సిబ్బంది తనిఖీ చేస్తుండగా డ్రైవర్ క్యాబిన్‌లో 50.2 కేజీల గంజాయి ఉందని గుర్తించి పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అక్కడికి చేరుకునేలోపే కబాసి పారిపోయాడు. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా కబాసిని పట్టుకులేకపోయారు. ఈ విషయం శంఖబ్రత బాగ్చీ దృష్టికి వెళ్లడంతో నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు ఒడిశ్శా పోలీసులు సహకరించాలని కోరారు. ఈ మేరకు మల్కాపురం పోలీసులు వారం పాటు ఒడిశ్శాలో ఉండి కబాసి కదలికలపై నిఘా ఉంచారు. విషయం తెలుసుకున్న కబాసి బెయిల్ కోసం గాజువాక లాయర్‌ను సంప్రదించాడు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కబాసి గాజువాక ప్రాంతంలో ఉన్నాడని తెలుసుకుని పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

స్టీల్‌సిటీ డిపోను కొనసాగించాలని వినతి


రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు కలిసిన ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ కార్యదర్శి వై శ్రీనివాసరావు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్టీల్‌సిటీ డిపోను అక్కడే కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు కోరారు. పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యేందకు నగరానికి వచ్చిన మంత్రిని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో శనివారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌సిటీ డిపోకు సంబంధించి స్టీల్‌ప్లాంట్‌కు ఆర్టీసీకి మధ్యజరిగిన 33 సంవత్సరాల లీజు ఒప్పందం కాలపరిమితి ముగిసిందని, అందువల్ల స్థలాన్ని ఖాళీ చేసి అప్పగించాలని ఆర్టీసీ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ఉక్కు శాఖా మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ విధానం అమలు అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పిళ్లా శంకరరావు, ఎంవీఆర్ మూర్తి, ఏకే శివాజీ, కేఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోర్టును సందర్శించిన నేపాల్, రష్యా బృందాలు



పోర్టు అథారిటీని సందర్శించిన నేపాల్, రష్యా ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నేపాల్ నుంచి వచ్చిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం, రష్యా నుంచి విచ్చేసిన వ్యాపార బృందాలు శనివారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించాయి. నేపాల్ ప్రతినిధి బృందానికి నేపాల్ పరిశ్రమ, వాణిజ్య, సరఫరాల మంత్రి అనిల్ కుమార్ సిన్హా నాయకత్వం వహించారు. ఆశాఖ సంయుక్త కార్యదర్శి బిపిన్ ఆచార్య, శాఖ ప్రతినిధి తరకరాజ్ భట్టా ఈ బృందంలో ఉన్నారు. రష్యా నుంచి వచ్చిన 11 మంది వ్యాపార ప్రతినిధులు కూడా పోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టులో ఉన్న ఆధునిక సౌకర్యాలు, సరకు రవాణా సామర్థ్యం, ఆధునీకరణ, యాంత్రీకరణ, చర్యలు, కవర్డ్ స్టోరేజీ సౌకర్యాలు, సోలార్ పవర్, నీటి రీసైక్లింగ్ విధానాల గురించి ఈ బృందాలకు పోర్టు అధికారులు వివరించారు.

బిర్సా ముండాకు నివాళి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి ఎన్నో ఉద్యమాలు చేపట్టి వారిని చైతన్య వంతులను చేసిన బిర్సా ముండా ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని భెల్ హెచ్‌బీవీపీ జనరల్ మేనేజర్ సి.గౌరీశంకర్ అన్నారు. భెల్ గుర్తింపు యూనియన్ కార్యాలయంలో శనివారం బిర్సా ముండా 150వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి శంకుస్థాపన

వేపగుంట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట కృష్ణానగర్ గుడివీధిలో కొలువైన దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో అన్నపూర్ణేశ్వరి అన్నదాన సత్రం పునఃనిర్మాణానికి శనివారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజల్లో కార్పొరేటర్లు బల్లశ్రీనివాసరావు, రాపర్తి కన్నా, ముమ్మనదేముడు పూజలు చేశారు.

పెట్టుబడుల సదస్సుకు భారీ స్పందన


పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్



సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చిత్రంలో మంత్రులు లోకేశ్, రవికుమార్, తదితరులు


స్టాల్స్ వద్ద ప్రతినిధులు


సదస్సులో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు

సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు అధిక సంఖ్యలో తరలి రావడంతో సందడిగా మారింది. అంచనాలకు మించి పెట్టుబడులు రావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలతో ఆయన ఉత్సాహంగా చర్చలు జరిపారు. ముగింపు సదస్సులో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, దుర్గేశ్, నాదెండ్ల మనోహర్, కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి


సంప్రదాయ నృత్యాలతో అతిథులకు స్వాగతం




తప్పెటగుళ్ల కళాకారుల నృత్యాభినయం



పారిశ్రామికవేత్తలతో మంత్రి సంధ్యారాణి, రాయపాటి శైలజ



శ్రీసిటీలో కంపెనీల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంటున్న దృశ్యం


కొమ్ము నృత్యం చేస్తున్న కళాకారులు


ప్రతినిధులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎంపీ శ్రీభరత్


భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడంతో ముఖ్యమంత్రి చేతుల మీదుగా జ్ఞాపికలు అందుకున్న కలెక్టర్ హరేంధర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ఎంపీ శ్రీభరత్, జేసీ మయూర్ అశోక్, మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, జిల్లా ప్రజా సంబంధాల అధికారి సదారావు

పద్మం సిల్వర్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం


సీఎంఆర్ సెంట్రల్‌లో పద్మం సిల్వర్ జ్యువెలరీ నూతన షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి నిధి అగర్వాల్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

గాజువాక, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశాలో పలు బ్రాంచ్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్న పద్మం సిల్వర్ జ్యువెలరీ గాజువాకలో నూతన షో రూమ్ ఏర్పాటు చేసింది. సీఎంఆర్ సెంట్రల్ మాల్ లో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను సినీ నటి నిధి అగర్వాల్ శనివారం ప్రారంభించారు. షోరూమ్‌లో ఉన్న ఆభరణాలను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ సిల్వర్ జ్యువెలరీ ఎంతో బాగున్నాయని, టెంపుల్ జ్యువెలరీ తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. ప్రత్యేక ఆహ్వానితులు, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతం గోల్డ్ జ్యువెలరీతో పాటు సిల్వర్ జ్యువెలరీకి కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. పద్మం జ్యువెలరీలో మంచి వెరైటీలు ఉండడం విశేషమని తెలిపారు. కాగా నూతన బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా రూ. లక్ష నగలు కొనుగోలుపై రూ.50 వేల విలువైన సిల్వర్ నగలు ఉచితంగా, రూ. 50 వేలు కొనుగోలుపై రూ.25 వేలు సిల్వర్ నగలు ఉచితంగా ఇవ్వనున్నట్టు షోరూమ్ నిర్వాహకులు తెలిపారు.

వాహన ప్రమాద రహిత రాష్ట్రంగా ఏపీ : రవాణా మంత్రి

ఆనందపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాహన ప్రమాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని రవాణా, యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గంభీరంలో ఉన్న వాహన సామర్థ్య పరీక్ష కేంద్రం నిర్మాణ పనులను శనివారం మంత్రి ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. పనుల ప్రగతిపై చర్చించారు. అనంతరం ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్టు ట్రాక్, కెమెరాలు సెన్సార్ల సాయంతో డ్రైవింగ్ సామర్థ్యం పరీక్షించే ఆధునిక మార్గాన్ని పరిశీలించారు. వాహనదారులతో ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ వాహన సామర్థ్య పరీక్ష కేంద్రాల నిర్మాణానికి కేంద్రం సాయంతో రూ.16 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ప్రమాదాల నియంత్రణపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కాలం చెల్లిన వాహనాలతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఆర్టీవో రామ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లు వేణుగోపాలరావు, బుచ్చిరాజు, బాలాజీరావు, ప్రకాశ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నెరెడ్కో ప్రోపర్టీ షోకు పోటెత్తిన సందర్శకులు


ప్రోపర్టీ షోలో ప్రదర్శనను తిలకిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, తదితరులు

పెదవాల్తేరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెరెడ్కో ప్రోపర్టీ షో రెండో రోజు శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. పెట్టుబడి సదస్సుకు వచ్చిన ఇన్వెస్టర్లు షోను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ పరిసరాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుండడంతో నగరవాసులూ పెద్దఎత్తున స్థిరాస్తుల కొనుగోలుకు ఆసక్తి కనబరచడంతో ప్రోపర్టీషోకు భారీ స్పందన లభిస్తోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, పి.గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు ప్రతి సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవడం సిద్ధహస్తులన్నారు. అతని దూరదృష్టి ఆలోచనలతో కొత్త అవకాశాలు వెదుకుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. గూగుల్ వంటి సంస్థలు విశాఖ రావడం చిన్న విషయం కాదని, దీంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు పూర్తిగా మారుతాయన్నారు. విశాఖ అంతర్జాతీయ నగరంగా రూపాంతరం చెందబోతుందన్నారు. భోగాపురం విమానాశ్రయం శరవేగంగా నిర్మితమవుతోందని తెలిపారు. బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు అంతర్జాతీయస్థాయిలో నిర్మాణాలు చేపట్టాలని కోరారు. అభివృద్ధే మంత్రంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రధాని మోదీకి పేదల కష్టాలు తెలుసన్నారు. విశాఖలో పెట్టుబడులకు దేశ, విదేశీ పారిశ్రామిక వేత్తలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. పరిశ్రమ ఏర్పా టు చేసే సంస్థలతో మాత్రమే ఒప్పందం చేసుకుంటున్నామని తెలిపారు. స్థానిక పారిశ్రామిక వేత్తలు పోటీలో పాల్గొన్నారు. నెరెడ్కో క్రెడిబులిటీ ఉన్న సం స్థని, భవిష్యత్తులో విశాఖలో విదేశీయులు ఇళ్లు కొనుగోలు చేస్తారని, అందుకు తగ్గ విధంగా నిర్మాణాలు ఉండాలని బిల్డర్లను కోరారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో నెరెడ్కో నిర్వాహకులు చక్రధర్, రమేష్‌బాబు, రాజాశేఖర్, వెంకన్న చౌదరి, సుబ్బరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తదితరులు పాల్గొన్నారు. కాగా సాయంత్రం రాష్ట్ర మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ ప్రాపర్టీ షోను సందర్శించి, నిర్వాహకులను అభినందించారు. ప్రాపర్టీ షో ద్వారా అందుబాటు ధరల్లో ఇళ్లు లభిస్తాయన్నారు.

రూ.75 కోట్లతో నగరంలో వీరాంజనేయ హోటల్

» ఏపీఈడీబీతో ఎంవోయూ చేసుకున్న యాజమాన్యం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏపీఈడీబీ అధికారులు, వీరాంజనేయ హోటల్ ప్రతినిధులు

విశాఖపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో రూ.75 కోట్లతో హోటల్ ఏర్పాటు చేసేందుకు వీరాంజనేయ హోటల్స్ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ మేరకు భాగస్వామ్య సదస్సులో శనివారం ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) అధికారులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయికాంత్ వర్మ, వీరాంజనేయ హోటల్స్ ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గుడిపాటి వినయ్‌కుమార్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. హోటల్ నిర్మాణంతో సుమారు 400 మందికి ఉపాధి లభిస్తుందని ఒప్పంద పత్రాల్లో పేర్కొన్నారు.

సదస్సులో పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఎంవీపీ కాలనీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతకు పెద్ద పీట వేసేలా భాగస్వామ్య సదస్సులో ఏర్పాట్లు చేశారు. చెత్తను విభజించి వేసేందుకు వీలుగా మూడు రకాల బాక్సును సిద్ధం చేశారు. ఒక దానిలో ఖాళీ వాటర్ బాటిల్స్ రీ సైకిల్ విభాగంలో, రీ యూజ్ విభాగంలో కాగితంతో తయారైన గ్లాసులు, ప్లేట్లు, టిష్యూ పేపర్లు, రెడ్యూస్ విభాగంలో ఆహార వ్యర్థాలు వేసేలా రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్ పేరిట విభజించారు. వాటి వినియోగంపై అక్కడి సిబ్బంది అతిథులకు అవగాహన కల్పిస్తూ విధులు నిర్వహించారు. దీనివల్ల ప్రాంగణమంతా పరిశుభ్రంగా కనిపించింది. జీవీఎంసీ చేసిన ఏర్పాట్లకు ప్రశంసలు లభించాయి.